www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 5 ఏప్రిల్ 2024

5

చిత్తూరు

జిల్లా ఎస్పీగా మణికంఠ చండోలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా నూతన ఎస్పీగా వివిన్. మణికంఠ చండోలును నియమిస్తూ జాతీయ ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం నూతన జిల్లా ఎస్పీగా మణికంఠ చండోలు బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం విజయవాడ సిటీ లా అండ్ ఆడర్ విభాగం డిప్యూటీ కమిషనర్‌గా మణికంఠ విధులు నిర్వహిస్తున్నారు. ఈయన 2018 బ్యాచ్‌కు చెందిన ఐపిఎస్ అధికారి, గతంలో గ్రేహౌన్స్ విభాగంలో అసాల్ట్ కమాండెంట్‌గా, శ్రీకాకుళం జిల్లా ఎస్ఈబి అదనపు ఎస్పీగా విధులు నిర్వహించారు. మొదటిసారిగా చిత్తూరు జిల్లా ఎస్పీగా ఎన్నికల కమిషన్ నేరుగా ఆయనను నియమించడం జరిగింది.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గుడిపాల మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా జాయింట కలెక్టర్, రిటర్నింగ్ అధికారి పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఉదయం సార్వత్రిక ఎన్నికలు-2024లో భాగంగా మే 13న నిర్వహించే పోలింగ్ కేంద్రాలను, అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద ఎస్-ఎస్ టీము ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును, పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని తహశల్దార్, ఏఆర్ఓ విజయలక్ష్మీ, ఎంపిడిఓ రాజశేఖర్ రెడ్డితో కలిసి జెసి పరిశీలించారు. మండల పరిధిలో ఉన్న 45 పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయా.. లేవా లని మళ్లీ ఒకసారి పరిశీలించాలని సూచించారు. అలాగే ఇంకా పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా చిన్నచిన్న మరమ్మతులు ఉంటే వెంటనే పూర్తి చేయించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. మండలంలోని ఎన్ఆర్‌పేట హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 205, 206, గొల్లమడుగు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన 221 పోలింగ్ కేంద్రాన్ని, పానాటూరు గ్రామంలో ఏర్పాటు చేసిన 224, 225, 225 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం పానాటూరు వద్ద ఏర్పాటు చేసిన చెకుపోస్టును పరిశీలించారు. 24/7 విధులు నిర్వహించాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించడంతోపాటు వాహనాల తనిఖీ సమయంలో వీడియో కవరేజ్ చేయాలని, అక్రమంగా తరలిస్తున్న డబ్బు మద్యం, ఇతర ఆర్టికల్స్ సీజ్ చేసి సంబంధిత పోలీసుస్టేషన్‌లో అందజేయాలన్నారు. అంతకు ముందు వసంతపురం, పానాటూరు గ్రామ సచివాలయాలలో అందజేస్తున్న పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. పింఛన్లు కోసం వచ్చే వారికి షామీనా, చైర్స్, తాగునీరు వంటి సౌకర్యాలను కల్పించాలని, సాధ్యమైనంత వరకు ఉదయం సాయంత్రం వేళల్లో పంపిణీ చేయాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. సెక్టోరియల్ అధికారులు, రూట్ ఆఫీసుర్లు, పంచాయతీ సెక్రటరీలు, బిఎల్ఓలు, విఆర్ఓలు తదితరులు ఉన్నారు.

కాసులకు కష్టాలు...

- వృద్ధులకు ఇక్కట్లు
- పింఛన్ కోసం లబ్ధిదారుల పడిగాపులు
- కనీస వసతులు లేక అవస్థలు

వికలాంగులు, ఒంటరి మహిళలు, వృద్ధులు ఒకరిపై ఆధారపడకుండా తమ జీవనాన్ని కొనసాగించుకోవాలన్న లక్ష్యంతో పింఛన్ పథకం రూపుదిద్దుకుంది. ప్రస్తుతం వేలాది మంది ప్రజలు ఈ పింఛన్ పైనే ఆధారపడి జీవిస్తున్నారు. నేడు పింఛన్ తీసుకోవడానికి వృద్ధులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. కిలోమీటర్ల దూరం వెళ్లి సచివాలయాల వద్ద పడి గాపులు పడాల్సి వస్తోంది.

ప్రజాశక్తి- పూతలపట్టు

గతంలో వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ పంపిణీ చేసేవారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వలంటరీ వ్యవస్థను ఎన్నికల సంఘం దూరం పెట్టింది. దీంతో ప్రభుత్వం పింఛన్లను ఆయా సచివాలయాల పరిధిలో పంపిణీకి శ్రీకారం పుట్టింది. దివ్యాంగులు, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న వారు, వీల్‌చైరుకు పరిమితమైన తదితరులకు ఇంటి వద్ద ఇస్తారని.. మిగిలిన వారు సచివాలయాలకు రావాలని అధికారులు సమాచారం ఇచ్చారు. ఆ మేరకు లబ్ధిదారులు సచివాలయాలకు ఉదయాన్నే వెళ్లి పడి కాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కనీస సౌకర్యాలు లేక ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి కొన్నిచోట్ల తాగునీరు కనీస కుర్చీలు లేక వృద్ధులు పడినకష్టాలు వర్ణణాతీతం. సచివాలయాల మెట్లు ఎక్కలేక దిగలేక వృద్ధులు అవస్థలు పడ్డారు.

నూతనపల్లి సచివాలయం వద్ద పింఛన్ల కోసం పడిగాపులు పడుతున్న వృద్ధులు

ఇబ్బందులు పడాల్సి వస్తోంది..

- ఆనందయ్య, పింఛన్ లబ్ధిదారుడు

గతంలో వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి ఉదయానికల్లా పింఛన్లు ఇచ్చేవారు. ఐదు కిలోమీటర్ల దూరంలోని ఎల్లంపల్లి గ్రామం నుంచి వచ్చాను. సమయానికి ఆటోలు అందుబాటులో లేకుండా నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. గతంలో లాగానే ఇంటి వద్ద పింఛన్లు పంపిణీ చేయాలి.

శుక్రవారం పూర్తి చేస్తాం..

- ప్రసన్న కుమారి, ఎంపీడీవో, పూతలపట్టు.

వికలాంగులు, నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులకు ఆయా సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దకే పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతోంది. ఇప్పటికే 76శాతం పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరిగింది. లబ్ధిదారులకు సచివాలయాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

పూతలపట్టులో...

పూతలపట్టు మండలంలో 25 పంచాయతీలు 256 గ్రామాలు 17 సచివాలయాలు ఉన్నాయి. కొన్నిచోట్ల సచివాలయాలకు 5,6 కిలోమీటర్ల దూరం రావాల్సి ఉంది. నగదు అత్యవసరమైన పలువురు వృద్ధులు వందల రూపాయలు ఖర్చుపెట్టి తమవెంట ఒకరిని పిలుచుకొని ఆటోలోను ఆశ్రయిస్తున్నారు. మండలంలో మొత్తం 8473 మందికి లబ్ధిదారులు ఉండగా... సుమారు రూ.2.42 లక్షల నగదును పంపిణీ చేయాల్సి ఉంది. గురువారం సాయంత్రం నాటికి 76శాతం పూర్తి చేసినట్టు అధికారులు చెబుతున్నారు. శుక్రవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం మండలంలో పూర్తవుతుందని అంటున్నారు.

వలంటీర్ల వ్యవస్థపైనే తొలి సంతకం

- టిప్పర్ డ్రైవర్లకూ 'వాహనమిత్ర'
- 'సిద్ధం' సభలో సిఎం జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, నాయుడుపేట, శ్రీకాళహస్తి

మేలో జరగబోయే ఎన్నికల్లో ఘన విజయం సాధించి 175కు 175 అసెంబ్లీ సీట్లు తప్పకుండా గెలుస్తామని సిఎం జగన్మోహన్‌రెడ్డి ఉద్ఘాటించారు. వాలంటీర్ల వ్యవస్థను పునరుద్ధరిస్తూ తొలి సంతకం చేస్తామన్నారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేటలో ఎంఎల్‌ఎ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో బహిరంగసభ జరిగింది. తిరుపతి జిల్లా నలుమూలల నుంచి భారీగా జన సమీకరణ చేశారు. ఆర్టీసీ బస్సుల్లో పెద్దఎత్తున తరలించారు. జగన్మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాల గురించి వివరించారు. అవ్వతాతలకు ఇంటికే పింఛన్, అక్కచెల్లెమ్మలకు బ్యాంకు రుణాలు, పేదవారికి ఇళ్లస్థలాలు ఇచ్చామన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత తమకే దక్కిందన్నారు. సంక్షేమ పథకాల వల్ల ప్రతి ఇంట్లో వైఎస్‌ఆర్‌సిపి నాయకులను తమ సొంత ఇంటివాళ్లలా చూస్తున్నారని, ఆ అభిమానమే అఖండ విజయంతో గెలిపిస్తుందన్నారు. దుష్ట చతుష్టయాన్ని ఓడించేందుకు మీరంతా సిద్ధమా? అని గర్జించే గొంతుకతో ప్రశ్నించారు.

టిప్పర్ డ్రైవర్లకూ 'వాహనమిత్ర'

డ్రైవర్లన్నా, దళితులన్నా ప్రతిపక్ష నేత చంద్రబాబుకు చిన్న చూపని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. అందుకే శింగనమల వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా దళితుడైన టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులను నిలబెడితే చంద్రబాబు ఓర్వలేక వేలిముద్రగాడంటూ పరుషంగా మాట్లాడాడనీ, దళిత జాతిని కించపరిచేలా వ్యవహరించాడని మండిపడ్డారు. వాస్తవానికి వీరాంజనేయులు చంద్రబాబు కన్నా ఎక్కువే చదివారనీ, రాష్ట్రంలోని డ్రైవర్లందరి ప్రతినిధిగా వైసీపీ తరపున టెక్కెట్టు ఇవ్వడం గర్వించదగ్గ విషయమని కొనియాడారు. డ్రైవర్లతో ముఖాముఖిలో భాగంగా టిప్పర్ డ్రైవర్లకు 'వాహనమిత్ర' ఇస్తానని ఎన్నికల హామీగా ప్రకటించారు. తొట్టంబేడు మండలంలోని పొయ్య గ్రామం వద్ద ఏర్పాటు చేసిన డ్రైవర్ల సదస్సులో ప్రసంగించారు. స్వయం ఉపాధికారులుగా తమ సొంత కాళ్లపై నిలబడి కుటుంబాలను పోషించుకుంటున్న డ్రైవరన్నలకు అండగా నిలబడుతున్న ఏకైక ప్రభుత్వం వైసీపీ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 3,93,655 మంది వివిధ రంగాల్లో పొట్ట పోసుకుంటున్న డ్రైవరన్నలకు వాహన మిత్ర పథకం కింద ఏడాదికి రూ.10 వేలు చొప్పున ఐదేళ్లకు గాను అక్షరాలా 12 కోట్లా 96 లక్షలు సాయం అందించామని చెప్పుకొచ్చారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 18 వేల మంది డ్రైవర్ కుటుంబాలకు రూ.61 కోట్లు అందజేశామని తెలిపారు.

జిల్లాలో ముగిసిన సిద్ధం రోడ్డు షో

'మేమంతా సిద్ధం' యాత్ర ఎనిమిదో రోజు గురువారం రేణిగుంట మండలం గురవరాజుపల్లి నుంచి బయల్దేరారు. మల్లవరం, ఏర్పేడు, పనగల్లు, శ్రీకాళహస్తి బైపాస్ మీదుగా చిన్నసింగమల సమీపానికి చేరుకున్నారు. మార్గమధ్యంలో శనకాయ చెట్లు పెరుకుతున్న కూలీలతో సంభాషించి వారు అందించిన శనక్కాయ పప్పులను తిన్నారు. వృద్ధులను, చిన్నారులను పలకరించి ముద్దాడారు. తొట్టంబేడు మండలం చిన్నసంగమల సమీపంలో లారీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లతో ముఖాముఖి నిర్వహించారు. నాయుడుపేట సభ అనంతరం ఓజిలిక్రాస్, బుదనం, గూడూరు బైపాస్, మనుబోలు, నెల్లూరు బైపాస్ మీదుగా చింతారెడ్డిపాలెం వద్ద రాత్రి బసకు చేరుకుంటారు. ఈ కార్యక్రమంలో నారాయణస్వామి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఉన్నం వాసుదేవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు మండలంలోని చిల్లకూరు గ్రామ పంచాయతీ నేషనల్ హైవే వద్ద ఎన్‌డిసిసిబి ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వందల ద్విచక్రవాహనాలతో, భారీ గజమాలతో స్వాగతం పలికారు. ఎంపిపి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నట్టు కార్యదర్శి రఘుపతి తెలిపారు. గురువారం బంగారుపాళ్యం మండలంలోని బోడబండ్ల సచివాలయం వినాయకపురం గ్రామంలో బోరు మోటర్ మరమ్మతులకు గురైంది. దీంతో ప్రజలకు తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతుండగా వెంటనే స్పందించిన సచివాలయ కార్యదర్శి రఘుపతి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేపట్టారు. వేసవి నేపథ్యంలో నీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శులు వెంటనే స్పందించి తాగునీరును ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాగునీటిని సరఫరా చేయడం లేదని ఫిర్యాదు..

తాగునీరు సరఫరా చేయడం లేదని ఎంపీడీవో శివశంకర్‌కు మండలంలోని తగ్గువారిపల్లి పంచాయతీ ఇందిరమ్మ కాలనీ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వారానికి ఒకసారి మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. దీనివలన తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నామని, వేసవి నేపథ్యంలో వెంటనే స్పందించి తాగునీరును ఏర్పాటు చేయాలని కోరారు. తాగునీటి సమస్యపై స్పందించిన ఎంపిడిఓ వెంటనే నీటి సరఫరాకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానికులు వహీదా, సల్మా, షాహినా, నగీన, హరిహర ప్రసాద్ పాల్గొన్నారు.

అమినిటీ కార్యదర్శికి షోకాజ్ నోటీస్

నీటి సరఫరా, పారిశుద్ధ్య పనులను తనిఖీ చేసిన కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

నగరంలో నీటి సరఫరా, పారిశుద్ధ్య పనులను నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరంలో కట్టమంచి పరిధిలో పలు వీధుల్లో కమిషనర్ పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. పలు వీధుల్లో డ్రైనేజీ కాలవలను పరిశీలించిన కమిషనర్ కాలువల్లో పూడిక మట్టిని తొలగించాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. పెరుమాళ్లగుడి వీధిలోని మురుగునీటి కాలువలో మురుగు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ఇంజనీరింగ్ అధికారుల సమన్వయంతో కాలువ లెవలింగ్ పనులు చేపట్టాలన్నారు. పారిశుధ్య పనుల్లో ఎక్కడా నిర్లక్ష్యం వద్దని అధికారులను, వార్డు కార్యదర్శులను ఆదేశించారు. వార్డుల్లో నీటి సరఫరాపై ప్రతిరోజు పర్యవేక్షించాలని ఆదేశించారు. 4వ వార్డు పరిధిలో నీటి సరఫరా పర్యవేక్షించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డు అమినిటీ కార్యదర్శి జ్యోతికి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. వార్డుస్థాయిలో అప్పగించిన పనులను వార్డు కార్యదర్శులు పక్కాగా నిర్వహించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. అనంతరం నగరంలోని ప్రధాన కూడళ్లు, ప్రధాన రహదారుల పరిధిలో పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ వెంట ఇన్చార్జి ఎంహెచ్వో చిన్నయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్ నరసింహ, వార్డు కార్యదర్శులు ఉన్నారు.

14 వరకే కొత్త ఓటర్ల నమోదు

సమావేశంలో మాట్లాడుతున్న నగరి ఆర్డీవో వెంకటరెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: ఈ నెల 14 వరకే 18 సంవత్సరాలు దాటిన యువతీ యువకులకు ఓటు నమోదుకు అవకాశం ఉందని ఆపై ఓటు కొత్త ఓటర్ల నమోదు చేయడం జరగదని ఎన్నికల అధికారి ఆర్డీవో వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరి ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన అన్ని పార్టీల నేతలు, అధికారుల సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున అన్ని పార్టీల వారు అనుమతులు లేకుండా ఏ కార్యక్రమాలు చేపట్టరాదన్నారు. ప్రతి ఖర్చును లెక్కించడానికి అధికారలను నియమించడం జరిగిందన్నారు. నామినేషన్లు ప్రారంభించిన నాటి నుంచి ప్రక్రియ మరింత కట్టుదిట్టంగా ఉంటుందన్నారు. ఓటర్ల తొలగింపుకు, సవరణలకు గడువు ముగిసిందని ఇక అభ్యర్థనలు చేసుకున్నా స్వీకరించడం జరగదన్నారు. అన్నీ పోలింగ్ కేంద్రాలలో కనీస మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. ప్రశాంత వాతావరణంలో స్వార్వత్రిక ఎన్నికలు జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

184 మంది వలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి -సదుం: మండల పరిధిలోని 184 మంది వలంటీర్లు వారివారి రాజీనామాలను గురువారం సదుం ఎంపిడిఓ రాజశేఖర్ బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతిపక్ష నాయుకులు వలంటీర్లుగా తాము చేస్తున్న సేవలను అవహేళన చేసి మాట్లాడటం బాధాకరమన్నారు. తాము ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి లాగా ఉంటూ స్వచ్ఛందంగా పనిచేస్తూ ఉంటే ప్రతి పక్ష నాయుకలు ఓర్వలేక తమను పదేపదే కించ పరిచినట్లు మాట్లాడడంతో రాజీనామాలను సమర్పిస్తున్నామని తెలిపారు.

ఏం చేశారని 'సిద్ధం' సభలు : బొజ్జల సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాళహసి

ఏం అభివద్ధి చేశారని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సిద్ధం సభలు నిర్వహిస్తున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ప్రశ్నించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక శ్రీకాళహస్తి ప్రాంతంలో కనీసం ఒక్క అభివద్ధి పనీ జరగలేదన్నారు. ఇపుడు ఏ మొహం పెట్టుకుని జగన్ ఓట్లు అడగటానికి ఈ ప్రాంతానికి వచ్చారన్నారు. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి ఇక్కడి పరిశ్రమల నిర్వాహకుల నుంచి వారి ఆదాయంలో 40శాతం కమీషన్ల రూపంలో వసూలు చేస్తున్నారన్నారు. ఈయన ముక్కంటి ఆలయం నుంచి ప్రతి నెలా రూ.2 నుంచి రూ.3కోట్లు మామూళ్లు తీసుకుంటున్నారన్నారు. రాజీవ్ నగర్ లో సుమారు 2వేల ప్లాట్లు కబ్జా చేసి సొమ్ము చేసుకున్నారన్నారు. ఇసుక అక్రమ రవాణా చేసి రూ.కోట్లు సంపాదించారన్నారు. బియ్యపు మధుసూదనరెడ్డి చేసిన ఈ అక్రమాలపై ముఖ్యమంత్రి జగన్ జోక్యం చేసుకుని విచారణ జరపాలని బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి డిమాండు చేశారు. బియ్యపు మధు మరోసారి గెలిస్తే శ్రీకాళహస్తిలో ప్రజల ఆస్తులు ఒక్కటీ మిగలనివ్వరన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు విజయకుమార్, చెంచయ్యనాయుడు, మిన్నల రవి, రవీంద్రనాథరెడ్డి పాల్గొన్నారు. గురువారం పట్టణంలోని 4, 5, 6 వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

బొజ్జల వెంకటసుధీర్ రెడ్డిపై కత్తితో దాడికి యత్నం

శ్రీకాళహస్తి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బొజ్జల వెంకటసుధీర్ రెడ్డిపై ఓ వ్యక్తి కత్తితో దాడికి యత్నించిన సంఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. టీడీపీ వర్గాల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి గురువారం ఉదయం ఐదవ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా మహేష్ కుమార్ (35) అక్కడకు వచ్చి బొజ్జల వెంకటసుధీర్ రెడ్డితో సెల్ఫీ ఫోటో తీసుకోవాలని అక్కడే ఉన్న టీడీపీ నేతలను కోరాడు. ఇందుకు వారు అంగీకరించారు. బొజ్జల వెంకటసుధీర్ రెడ్డితో సెల్ఫీ తీసుకుంటుండగా తన జేబులో దాచుకున్న కత్తిని మహేష్ కుమార్ బయటకు తీశాడు. ఇది గమనించిన టీడీపీ కార్యకర్తలు వెంటనే ఆ కత్తిని లాక్కున్నారు. అదేవిధంగా బొజ్జల వెంకటసుధీర్ రెడ్డిపై దాడి చేయకుండా అడ్డుకున్నారు. అనంతరం టీడీపీ కార్యకర్తలు అతనిని శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులకు అప్పగించారు. మహేష్ కుమార్ ను వారు విచారించగా అతనది చంద్రగిరి అనీ, తిరుమల ఆర్టీసీ డిపోలో మెకానిక్ గా పని చేస్తున్నట్లు తేలింది. తాగుడుకు బానిసై భార్య, పిల్లలను వేధించే వాడనీ, ఈ వేధింపులకు తాళలేక మహేష్ కుమార్ భార్య మీనాకుమారి కొంతకాలం కిందట తన పుట్టినిల్లు అయిన శ్రీకాళహస్తికి వచ్చేసింది. దీంతో మహేష్ కుమార్ కూడా ఇక్కడకు వచ్చేశాడు. భార్య వద్దనే ఉంటూ అతడు విధులకు వెళుతున్నాడు. ఇపుడు విధులకు డుమ్మా కొట్టి బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి వద్దకు కత్తితో వెళ్లి ఆ పార్టీ నేతలకు పట్టుబడ్డాడు. ఈ సంఘటన శ్రీకాళహస్తిలో సంచలనం కలిగించింది. కత్తితో దాడికి యత్నించిన మహేష్ కుమార్ వైసీపీ కార్యకర్తని బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి మీడియాకు తెలియచేశారు. మహేష్ కుమార్ ప్రస్తుతం టూ టౌన్ పోలీసుల అదుపులో ఉన్నాడు. కత్తితో తిరుగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేసినట్లుగా మహేష్ పై కేసు నమోదు చేసినట్లు సీఐ రారాజు తెలిపారు.

'క్రమశిక్షణతో కూడిన విద్య అలవర్చుకోవాలి'

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ విజయ కుమార్

ప్రజాశక్తి- కార్వేటినగరం: స్థానిక లక్ష్మీనరసింహ హైస్కూల్లో గురువారం 12వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవంలో విద్యార్థులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి విజయకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య అలవరుచుకుంటే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ధనంజయ రెడ్డి మాట్లాడుతూ విద్యను కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని అన్నారు. అలాగే సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులను గౌరవించాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్లు దిలీప్ కుమార్, వెంకటేష్, పురుషోత్తం, హెచ్ఎం మహేశ్వర రాజు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి జిల్లా అధ్యక్షులుగా సిఆర్ రాజన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులుగా సిఆర్ రాజన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గాంధీ విగ్రహం మీదుగా టిడిపి కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం ముఖ్యనేతలు, కార్యకర్తలు సిఆర్ రాజన్‌కు ఘనస్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి చంద్రబాబు నాయుడు జిల్లా అధ్యక్షులుగా నియమించడం జరిగిందని, పార్టీని అభివృద్ధి చేయడంతో పాటు అందర్నీ కలుపుకుపోయి ఎన్నికలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ స్థానంలో విజయం కోసం కృషి చేయనున్నట్లు చెప్పారు.

జిల్లాలో అన్ని సీట్లను స్వీప్ చేస్తాం

టిడిపి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వచ్చే ఎన్నికల్లో చిత్తూరు జిల్లాలోని ఒక పార్లమెంట్ స్థానంతో పాటు అన్ని అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుంటామని టిడిపి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుప్పం నియోజకవర్గంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడును ఓడించేందుకు విఫల యత్నం చేస్తోందని తెలిపారు. అయితే రానున్న ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు లక్ష ఓట్లకు పైగా మెజారిటీతో గెలుపొందడం అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా మరోసారి ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జిల్లాలో ఎన్నడూ తమ పార్టీ విజయం స్థానాలను సైతం ఈ దఫా ఎన్నికల్లో గెలుచుకోబోతున్నామని అన్నారు. కుప్పానికి నీళ్లు ఇచ్చామని చంకలు గుద్దుకుంటున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబంధిత నీళ్లు ఎక్కడ పారుతున్నాయో తెలపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ వికె వసంత్ కుమార్ పాల్గొన్నారు.

'టిడిపితోనే మైనార్టీల అభివృద్ధి'

ప్రజాశక్తి - రామకుప్పం: తెలుగుదేశం పార్టీతోనే మైనార్టీలకు దశా దిశా అభివృద్ధి జరిగిందని కుప్పం నియోజకవర్గ పరిశీలకులు గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. గురువారం టిడిపి పార్టీ కార్యాలయంలో టిడిపి శ్రేణులతో సమావేశమై మాట్లాడారు. గడిచిన ఐదు సంవత్సరాలలో మైనార్టీలకు వైసీపీ ప్రభుత్వం ఏ ఒక్క అభివృద్ధి చేయలేదని ధ్వజమెత్తారు. మైనార్టీలకు షాదీ తోఫా, రంజాన్ తోఫా ఇవ్వక పోగా హాజీ హౌస్‌లకు తాళాలు వేశారన్నారు. మసీదులకు షాదీ ఖానాలకు నిధులు నిలుపుదల చేశారని మండిపడ్డారు. మైనారిటీలపై దాడులు పెరిగాయని వైసీపీ నాయకుల తీవ్ర ఒత్తిళ్లతో నంద్యాలలోని అబ్దుల్ సలాం కుటుంబం ఆత్మహత్య, చిత్తూరు జిల్లా పలమనేరులో మిస్బా ఆత్మహత్య, నరసరావుపేటలో ఇబ్రహీం హత్య, కర్నూలు జిల్లా ఎర్రబడు గ్రామంలో హాజీరా మానభంగం చేశారని మండిపడ్డారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ఇటువంటి దాడులు ఎన్నడు జరగలేదన్నారు. మైనార్టీలు అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో చంద్రబాబును అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి రాష్ట్ర నేత మునస్వామి, సలాం సాబ్ ,రఫీ, పత్రా నారాయణ, విశ్వనాథ్, సుబ్రి, కామరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుంటేనే దేశ భవిష్యత్ : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్: రాజ్యాంగాన్ని కాపాడుకుంటేనే దేశ భవిష్యత్ బాగుంటుందని ప్రొఫెసర్ మురళీధర్ అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 133 వ జయంతి పురస్కరించుకొని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్ వి యూనివర్సిటీ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియం లో "భారత రాజ్యాంగం విశిష్టత" అంశం పై సదస్సు నిర్వహించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాజ్యాంగ పీఠికను చదివి సదస్సును ప్రారంభించారు. సదస్సుకు ఎస్ఎఫ్ఐ వర్సిటీ అధ్యక్షులు నరేంద్ర అధ్యక్షత వహించారు. ప్రొఫెసర్ మురళీధర్ మాట్లాడుతూ రాజ్యాంగం మన పూర్వ నాయకుల శ్రమ వల్ల భారత రాజ్యాంగం ఏర్పడిందని, రాజ్యాంగం ముందు మాటగా పీఠికలో రాజ్యాంగ మౌళిక సూత్రాలు పొందుపరిచారని, అదే రాజ్యాంగ యొక్క గొప్ప విశిష్టత అని వారు అన్నారు. నేటి తరం విద్యార్థి, యువత కచ్చితంగా రాజ్యాంగం చదవాలని, దేశాన్ని కాపాడుకోవాలని చెప్పారు. ఆల్ ఇండియా రేడియో కోర్డినేటర్ ఆకుల మల్లీశ్వర రావు మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం అణచివేతకు గురైన వర్గాల అభ్యున్నతి కొరకు జీవితాన్ని త్యాగం చేసి రాజ్యాంగం రూపొందించడంలో కఠోర శ్రమ చేసి ఉన్నారన్నారు. అలాంటి రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే నేటితరం విద్యార్థుల తక్షణ కర్తవ్యం అని, అదే అంబేద్కర్ కి మనం అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రామాంజనేయులు మాట్లాడుతూ యూనివర్సిటీలో చదివే విద్యార్థులు గొప్ప అవకాశాలు కల్గిన వారని, వారు దేశం కోసం చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని, యువత దేశం కోసం, ధర్మం కోసం, న్యాయం కోసం నిలవాలన్నారు. భారత రాజ్యాంగంను చదివి మన హక్కులు, బాధ్యతలు తెలుసుకొని ఉన్నత అవకాశాలు సృష్టించి దేశాన్ని నడిపే రథ చక్రాలు కావాలని చెప్పారు. జెవివి జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప మాట్లాడుతూ దేశంలో భారత రాజ్యాంగం విలువలు రోజు రోజుకి కనుమరుగయ్యే పరిస్థితులలో సవాళ్లు ఎదుర్కొంటున్నామని, అలాంటి పరిస్థితిలో మనం రాజ్యాంగం యొక్క గొప్పతనాన్ని, మౌళిక స్వభావాన్ని కాపాడుకుంటేనే దేశంలోని అందరికీ సామాజిక న్యాయం చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ మాజీ జిల్లా కార్యదర్శి మాధవ్ కృష్ణ, ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి రవి, అధ్యక్షులు అక్బర్, యూనివర్సిటీ కార్యదర్శి వినోద్, జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, తేజ, గర్ల్స్ కన్వీనర్ హరిత, యూనివర్సిటీ నాయకులు భార్గవ్, సుస్మిత, సాయి, శివ పాల్గొన్నారు.

తిరుపతి ఎంపీ స్థానాన్ని మాదిగలకు కేటాయించాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్న ఆరు యస్సీ రిజర్వుడు స్థానాలను అన్ని రాజకీయ పార్టీలు మాలలకే కేటాయించడం పట్ల, పలు మాదిగ సంఘాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. గురువారం నగరంలోని ఓ ప్రయివేటు హొటల్లో నిర్వహిస్తున్న తిరుపతి పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల మేనేజ్మెంట్ సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని బిజెపి నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ పార్టీ రాష్ట్ర ఎన్నికల నిర్వాహ కుడు అరుణ్ సింగ్ విచ్చేశారు. విషయం తెలుసుకున్న మాదిగ సంఘాల నాయకులు హొటల్ వద్దకు చేరుకుని, ప్లకార్డ్స్ చేతపట్టి పెద్ద యెత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాదిగ మహాజన సంఘం నేత కరాటపు సుధాకర్ మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్న 4అసెంబ్లీ , 2 పార్లమెంట్ స్థానాలు యస్సీ రిజర్వుడు గా, ఉన్నాయని అయితే అన్ని రాజకీయ పార్టీలు 6 స్థానాలను కేవలం మాలల కే కేటాయించడం దారుణమని అవేదన వ్యక్తం చేశారు. అధికారం లోకి వచ్చిన వంద రోజుల్లో యస్సీ వర్గీకరణ చేసి మాదిగలకు మేలు చేస్తాం అని చెప్పిన బిజెపి, రెండు సార్లు కేంద్రంలో అధికారాన్ని చేపట్టి, మాదిగలను మోసం చేసిందని దుయ్యబట్టారు. కాగా తిరుపతి పార్లమెంట్ నియోజక వర్గంలో మూడు లక్షల పై చిలుకు ఓటర్లు కలిగిఉన్న మాదిగలకు బిజెపి సైతం ఒక్క సీటు కూడా కేటాయించడం దారుణమన్నారు. బిజెపి ఎన్నికల పరిశీలకుడు అరుణ్ సింగ్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాదిగ మహాజన సంఘం, ఏపి యం ఆర్ పియస్ నాయకులు మణి, లోకనాధం, టియస్ మణి, సంతానం, ఆదే య్య, ఉదయ్ పాల్గొన్నారు.

సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వర్తించాలి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు వారి విధులను అప్రమత్తంగా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు తూ.చా తప్పకుండా నిర్వర్తించాలని ఇంఛార్జి కలెక్టర్ ధ్యానచంద్ర హెచ్ఎం పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ లో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు, సంబంధిత నోడల్ అధికారులతో కలిసి వారి బాధ్యతలపై, నామినేషన్ల ప్రక్రియపై శిక్షణ కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఎన్నికల విధులలో పాల్గొంటున్న అధికారులు ఎంతో బాధ్యతగా సమన్వయంతో విధులు నిర్వర్తించాలని, ఎన్నికల విధులు గతంలో నిర్వర్తించిన అనుభవం ఉన్నా ప్రతిసారి కొత్తగా ఎన్నికలను చూడాలని, రిటర్నింగ్ అధికారి హ్యాండ్ బుక్ ఎన్నికల మార్గదర్శకాలను పూర్తిగా అవగాహన చేసుకుని, తదనగుణంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని, ఎలాంటి అలసత్వం ఉండరాదని, ఎన్నికల నిర్వహణ ఒక టీం వర్క్ అని, పూర్తి సమన్వయంతో విధులు చేపట్టాలని సూచించారు. ఏప్రిల్ 18న సార్వత్రిక ఎన్నికలు 2024 నోటిఫికేషన్ ఇవ్వవలసి ఉంటుందని ఆ కాపీని రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో, ఏఆర్ఓ, గ్రామపంచాయతీ, వార్డు సచివాలయం, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రదర్శించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి అందరికీ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పెంచల కిషోర్, ఈఆర్ఓ లు మున్సిపల్ కమిషనర్ తిరుపతి అదితి సింగ్, కిరణ్ కుమార్, నిశాంత్ రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతాలోచనలతో ముందుకెళ్లాలి

శ్రీరామలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పోటీ ప్రపంచంలో నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ ఉన్నత ఆలోచనలతో విద్యార్థులు ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని బెంగళూరుకు చెందిన హెక్సావేర్ టెక్నాలజీస్ హెడ్ ఆఫ్ క్యాంపస్ రిక్రూట్మెంట్ సౌగత సేన్ పిలుపునిచ్చారు. గురువారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో ' తరంగ్-2024 ' పేరుతో కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సౌగత సేన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నూతన టెక్నాలజీలు అందుబాటులోకి రానున్నాయని, దీన్ని మానవ అవసరాల మేరకు ఉపయోగించుకుంటూ భవిష్యత్ తరాలకు అవసరమయ్యే గొప్ప ఉపయుక్తాలను తయారుచేయాలని కోరారు. ఉన్నత ఆలోచనలతో ఉన్న విద్యార్థులకు నూతన టెక్నాలజీ మంచి ఉపాధి అవకాశాలను కల్పిస్తుందన్నారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఎప్పటికప్పుడు నూతన టెక్నాలజీలకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పిస్తూనే వాటిపై ప్రయోగాలకు అవసరమైన ఇన్ఫ్రాస్ట్రక్చర్ ను కళాశాలలో అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఇటువంటి కొత్త ఆలోచనలను అమలు చేస్తున్న శ్రీరామకు ఇటీవల "నాక్" ఏ గ్రేడ్ గుర్తింపు లభించిందన్నారు. విద్యార్థులు కళాశాలలో అందుబాటులో ఉన్న ల్యాబ్లను వినియోగించుకుని వారి భవిష్యత్తుకు ఉన్నత బాటలు వేసుకోవాలని కోరారు. కళాశాల సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జయచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్. త్రివిక్రమ్ పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..

టిడిపి అభ్యర్థి మురళీమోహన్ సవాల్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పూతలపట్టు ఎస్సీ నియోజకవర్గంలో తెలుగుదేశం పాలన, వైసిపి పాలనలో చేసిన అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధమని టిడిపి పూతలపట్టు నియోజవర్గ అభ్యర్థి మురళీమోహన్ వైసిపి నాయకులకు సవాలు విసిరారు. వైసిపి పాలనలో అభివృద్ధి పనుల కోసం ఒక్క రూపాయి ఖర్చు చేయని జగన్ ప్రజల సంకల్ప యాత్రలో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీపై అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు. కేవలం ఎన్నికల్లో ప్రయోజనం కోసం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం మానుకోవాలని సూచించారు. తెలుగుదేశం ప్రభుత్వం పింఛన్ పథకాన్ని రూ.35 నుండీ ప్రారంభించి రెండు వేల వరకు తీసుకొచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. వైసిపి నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో, నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించనున్నట్లు తెలిపారు. జనసేన జిల్లా అధ్యక్షులు ప్రసాద్, బిజెపి జిల్లా నాయకులు అట్లూరి శ్రీనివాసులు, నాయకులు చిట్టిబాబు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మురళీమోహన్

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

భార్యకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి- సోమల: చిత్తూరు జిల్లా సోమల మండలం దిడ్డివారిపల్లె సమీపంలో ద్విచక్రవాహనం చెట్టును ఢీకొన్న ప్రమాదంలో భర్త మరణించగా భార్యతీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పీలేరు మండలం రేగల్లు గ్రామానికి చెందిన ఆనంద్ (45) భార్య పుంగనూరు గంగజాతరకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆనంద్ అక్కడికక్కడే మృతిచెందగా అతని భార్య తీవ్రంగా గాయపడింది. స్థానికులు 108కు సమాచారం అందించడంతో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

ప్రజాశక్తి- చౌడేపల్లి



అనుమానాస్పద స్థితిలో ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన గురువారం చౌడేపల్లిలో చోటుచేసుకుంది. పట్టణంలోని బజారు వీధిలో నివసించే సాయి రితీష్ (14) స్థానిక ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. అతని తల్లి హేమ కళ్యాణి ఉద్యోగరీత్యా బయటకు వెళ్లి మధ్యాహ్నం భోజన సమయంలో ఇంటికి వచ్చింది. ఇల్లు తెరిచి ఉండటంతో లోపలికి వెళ్లి చూసేసరికి రితీష్ ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూసేసరికే బాలుడు మృతిచెంది ఉన్నాడు. స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అనుమానాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని దంపతులకు తీవ్ర గాయాలు



ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి - వీ.కోట జాతీయ రహదారిలో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని దంపతులు తీవ్ర గాయాల పాలైయ్యారు. స్థానికుల కథనం మేరకు... మండలంలోని తీర్థం గ్రామానికి చెందిన శివ, అతని భార్య పావని ద్విచక్రవాహనంపై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం వెనుకనుంచి వచ్చి ఢీకొంది. ప్రమాదంలో శివ కాలుకు ఫ్యాక్చర్ కాగా పావని తలకు బలమైన గాయమైంది. గుర్తించిన స్థానికులు ఇరువుని 108లో ఆసుపత్రికి తరలించారు.

'వృద్ధుల ఉసురుపోసుకుంటున్నారు'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

వృద్ధులు, వికలాంగుల ఉసురుపోకుంటున్న టిడిపికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని వైసిపి నాయకులు జ్ఞానజగదీష్, గాయత్రిదేవి, రాహుల్ రాజారెడ్డిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థపై తెలుగుదేశం పార్టీ చేస్తున్న ప్రచారంపై ఉద్దేశపూర్వంగా ఈసికి ఫిర్యాదు చేసి ఒకటో తారీకు పింఛన్లు అందుకుంటున్న వృద్ధులు, వికలాంగులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి సచివాలయ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు వలంటీర్లకు భరోసా కల్పిస్తామన్నారు. కార్పొరేటర్ శశికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలోకి చేరికలు

ప్రజాశక్తి - రామకుప్పం:

మండలంలోని 89పెద్దూరు గ్రామపంచాయతీలో టిడిపికి చెందిన పలు కుటుంబాల కార్యకర్తలు ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి స్వాగతించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రతి ఒక్కరికి లబ్ధి పొందేలా సంక్షేమ అభివృద్ధి చేపట్టారన్నారు. కుప్పం నియోజకవర్గంలో ప్రత్యేక చొరవ చూపి సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వీధిదీపాలు తదితర మౌలిక వసతులు కల్పించారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బాబు రెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ బర్కతుల్లా నేతలు సుగుణప్ప, కేశవరెడ్డి, చెంగారెడ్డి, గోవిందప్ప, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

'ఆదిమూలంను ఓడిస్తాం'

ప్రజాశక్తి-తిరుపతిడెస్క్:

టీడీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదిమూలంను కొనసాగిస్తే ఎన్నికల్లో ఓడించి తీరుతామని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. గురువారం నారాయణవనంలోని ఓ కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం అభ్యర్థిత్వం పట్ల వ్యతిరేకిస్తూ సమావేశంలో ఆగ్రహావేశాలతో రగిలిపోయారు. తమ మనోభావాలతో సంబంధం లేకుండా ఐదేళ్లపాటు అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఆదిమూలం కొనసాగి తిరిగి మళ్లీ టీడీపీ తరపున అభ్యర్థిగా ప్రకటిండానికి తీవ్రంగా వ్యతిరేకించారు. ఆదిమూలం తప్ప కొత్త వ్యక్తి ఎవరైనా గెలిపించుకుంటామని ముక్తకంఠంతో గళం విప్పారు. సమావేశంలో నాయకులు శివకుమార్ నాయుడు, వినాయక, శివయ్య, గిరిబాబు, మునుస్వామి యాదవ్, దొరబాబునాయుడు, వెంకటేష్ యాదవ్, సురేష్ చౌదరి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి- వెదురుకుప్పం:

మండలంలోని మొండివెంగనపల్లి పంచాయతీ పరిధిలోని నెమలగుంట దళితవాడకు చెందిన గుండాలయ్య (సుబ్రహ్మణ్యం) బుధవారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న జిడినెల్లూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

అలాగే కార్వేటినగరం మండలం విజయ మాంబాపురం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం నాయుడు గురువారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న జిడి నెల్లూరు టిడిపి అభ్యర్థి థామస్ తమ్ముడి నిధి, జనసేన ఇన్‌ఛార్జి పొనన యుగంధర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కుటుంబ సభ్యులకు పరామర్శించి సానుభూతి తెలిపారు.

నగరి మండలంలోని తడుకుపేట గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీవర్గ నేత, మాజీ జడ్పీటీసీ సభ్యులు, మండల జడ్పీటీసీ సభ్యులు గాంధీ తండ్రి

అయిన ఎంపి సుబ్రమణ్యం అలియాస్ పళని (70) కర్మక్రియలకు మంత్రి ఆర్కే రోజా హాజరై సుబ్రమణ్యం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సంక్షిప్త వార్తలు

కిరణ్ కుమార్ రెడ్డికి ఘన స్వాగతం



ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత రాజంపేట ఉమ్మడి కూటమి ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి, పీలేరు టిడిపి నియోజకవర్గ అభ్యర్థి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిలకు గురువారం స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. పుంగనూరులోని ఓ కార్యక్రమానికి వెళుతుండగా స్థానిక టిడిపి నాయకులు కుమార్ రెడ్డి, పార్థసారథి, బిజెపి నాయకులు వినోద్ కుమార్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్ ఆయనకు ఘనస్వాగతం పనికి దుశ్శాలవాలతో సన్మానించారు.

మండపం నిర్మాణంకు భూమిపూజ

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లె పంచాయతీ కొండారెడ్డి గ్రామంలో వెలసిన కనుకొండ రాయస్వామి ముఖమండపంకు గురువారం భూమిపూజ చేశారు. కొండకిందపల్లె గ్రామంకు చెందిన అనసూయమ్మ కుటుంబ సభ్యులు స్వామివారి విగ్రహం గుడికి అందజేస్తామని హామీ ఇవ్వడంతోపాటు గుడి నిర్మాణానికి రూ.లక్షల విరాళంను అందజేశారు. పెనుమూరు మండలం, ఇరేనుపల్లె సర్పంచ్ కామసాని సుధాకర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు దాతలు అనసూయమ్మ కుటుంబ సభ్యులకు శాలువా కప్పి సన్మానించారు.

'రాజన్'కు ఘనసన్మానం

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు

చిత్తూరు జిల్లా పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షులుగా డాక్టర్ రాజన్ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మండల బీసీ సెల్ అధ్యక్షులు జ్యోతి యాదవ్, నియోజకవర్గ ముస్లిం మైనార్టీ ప్రధాన కార్యదర్శి నియాజ్ అలీ, మండల ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీ సగికుమార్, గంగయ్య, స్వామినాథన్ గజమాలతో ఘనంగా సన్మానించారు.

ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి- పలమనేరు:

పలమనేరు పట్టణంలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద మాజీమంత్రి ఎన్.అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక నమాజులో ఆయన ముస్లిం సోదరులతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఖాజాపీర్, చాంద్బాషా, మాబాషా, కమాల్, హనీఫ్, అమానుల్లా, అఫ్రోజ్, జిలాని, సాదిక్, నదీమ్ పాల్గొన్నారు.

ఎస్వీ గో సంరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

తిరుమల : భువనేశ్వర్‌కు చెందిన బల్భద్ర డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గురువారం ఎస్వీ గో సంరక్షణ ట్రస్టుకు రూ. 10 లక్షలు విరాళం అందించింది. ఆ సంస్థ తరఫున ప్రతినిధి రాఘవేంద్ర ఈ మేరకు విరాళం డిడిని తిరుపతిలోని పరిపాలన భవనంలో టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డికి అందజేశారు.

జీవనప్రగతి సాధనే మెట్లోత్సవం అంతరార్థం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ధర్మమార్గంలో నడుస్తూ జీవితంలో ఒక్కో మెట్టు ఎక్కుతూ భగవంతుడిని చేరుకోవడమే మెట్లోత్సవం అంతరార్థమని అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ చెప్పారు. శ్రీ తాళ్లపాక అన్నమయ్య 521వ వర్ధంతిని పురస్కరించుకుని టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం ఉదయం అలిపిరి పాదాలమండపం వద్ద మెట్లోత్సవం వైభవంగా జరిగింది.ఆంధ్ర, తెలంగాణా, కర్నాటక రాష్ట్రాల నుంచి దాదాపు రెండువేల మందికి పైగా కళాకారులు భజనలు చేసుకుంటూ స్వామివారిని దర్శించుకుంటారు. శుక్రవారం సాయంత్రం తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో సప్తగిరి సంకీర్తనల గోష్టిగానం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ గోవిందరాజ స్వామి ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, అన్నమాచార్య వంశీయులు తాళ్లపాక హరినారాయణాచార్యులు పాల్గొన్నారు.

శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి సిటి : శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో ఏప్రిల్ 9వ తేదీ ఉగాది ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునిక్రిష్ణా రెడ్డి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ పాల్గొన్నారు.

సప్తవర్ణశోభితంగా పుష్పయాగం

ప్రజాశక్తి రామచంద్రపురం(చంద్రగిరి)

మండలంలోని శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం పుష్పయాగ మహోత్సవం వైభవంగా జరిగింది. గురువారం తెల్లవారుజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొల్పి అనంతరం వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. మంగళ వాయిద్యాలు వేదమంత్రాల నడుమ స్వామివారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పుష్పయాగానికి 3 టన్నుల పుష్పాలను దాతలు విరాళంగా అందించారు. తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి పుష్పాలు విరాళంగా అందాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, గార్డెన్ మేనేజర్ జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి కలెక్టర్‌గా ఎస్ హెచ్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

తిరుపతి జిల్లా కలెక్టర్గా ఎస్ హెచ్ ప్రవీణ్ కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి జవహర్ రెడ్డి గురువారం ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి జిల్లా కలెక్టర్గా పనిచేస్తున్న లక్ష్మీ షాను బదిలీ చేసి ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశించిన విషయం విదితమే. అందులో భాగంగా ఆయన మంగళవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. కొత్త కలెక్టర్‌గా ముగ్గురు పేర్లు ఎన్నికల కమిషన్కు ప్రతిపాదించడంతో, అందులో నుంచి ప్రవీణ్ కుమార్‌ను జిల్లా కలెక్టర్‌గా ఎంపిక చేశారు. శుక్రవారం ఆయన విధుల్లో చేరనున్నారు.

9న తిరుచానూరులో ఉగాది వేడుకలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

సిరులతల్లి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఏప్రిల్ 9వ తేదీన ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, మధ్యాహ్నం 3 నుండి 4 గంటల వరకు శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో అమ్మవారి ఉత్సవర్లకు అభిషేకం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా విఐపి బ్రేక్ దర్శనం, కుంకుమార్చన, ఊంజల్ సేవను టీటీడీ రద్దు చేసింది.